క్లుప్తంగా

పన్ను బకాయిలు చెల్లించండి



పన్నుల వసూలులో పాల్గొన్న కమిషనర్

గుంతకల్లుటౌన్: ఆస్తి, నీటి పన్నుల బకాయిలను వెంటనే చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మున్సిపల్ రెవెన్యూ అధికారులతో కలసి అధిక బకాయిలు చెల్లించాల్సిన వ్యాపారులను కలిశారు. పట్టనంలోని హీరో షోరూమ్ యజమాని నుండి రూ.లక్ష వసూలు చేశారు. పన్నుల వసూలు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. మున్సిపల్ దుకాణాల్లోని లీజుదారులతో పాటు ప్రజలు సకాలంలో పన్నులను చెల్లించాలని ఆయన కోరారు. మున్సిపల్ ఆర్ఐలు ఎర్రిస్వామి, సి.కె.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డేటా డైనమిక్స్‌పై జాతీయ వర్క్ షాప్



మాట్లాడుతున్న శోభా బిందు

గుత్తి: పట్టణంలోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో వారం క్రితం ప్రారంభమైన డేటా డైనమిక్స్ జాతీయ వర్క్ షాప్ సోమవారం ముగిసింది. కార్యక్రమానికి జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ శోభా బిందు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఆధునిక సమాజంలో ప్రతీ విషయం డేటాపై ఆధార పడి ఉందన్నారు. అనలైజర్స్ ఆవశ్యకత భవిష్యత్‌లో చాలా కీలమన్నారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ స్కిల్స్ నేర్చుకుంటే మంచి ఉద్యోగాలు సాధించవచ్చునన్నారు. అనంతరం డేటా కలెక్షన్స్, డేటా టూల్స్, డేటా ప్రాసెసింగ్ టెక్నిక్స్, విజువలైజేషన్‌పై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, సీఎండీ రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ నమ్రత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



సాయి కిరణ్

గుత్తి: గుత్తి ఆర్ఎస్ సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలకు చెందిన సాయి కిరణ్ అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం మేషర్మియా తెలిపారు. రెండు రోజుల క్రితం ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనంతపురంలో అథ్లెటిక్స్ సెలెక్షన్స్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన సాయి కిరణ్‌ను సెలెక్టర్లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 6న ఏలూరు జిల్లా ఉంగుటూరులో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సాయి కిరణ్ పాల్గొంటారు. ఈ నేపథ్యంలో మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సాయి కిరణ్‌ను హెచ్ఎం మేషరిమ్మయా, పీఈటీ రంగనాయకులు, ఉపాధ్యాయులు అభినంచారు.

వివాహానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి

శింగనమల: మండలంలోని తరిమెల గ్రామానికి చెందిన పూజారి పెద్దన్న కుమారుడు చిన్న నల్లప్ప వివాహానికి కంచిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు జెడ్పీటీసీ కంచిరెడ్డి సుధ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డిలు సోమవారం రూ.15 వేలు అందజేశారు. నిరుపేద కుటుంబాల వివాహాలకు అండగా ఉంటామన్నారు.

రంగరాయుల విగ్రహ స్థూపం ఏర్పాటు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న శింగనమల గ్రామస్తులు

శింగనమల: జిల్లాలో అతి పెద్ద చెరువును శ్రీకృష్ణ దేవరాయుల పాలనలో శ్రీరంగరాయులు నిర్మించారని, అందువలన చెరువు మరవకొమ్మ ప్రాంతంలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని శింగనమల గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. చెరువు సమీపంలోని 96 సర్వే నంబరులో శ్రీరంగ రాయుల విగ్రహ స్థూపం, ఉద్యానవనం, పర్యటక కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. అలాగే చెరువులో బోటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో రాంచరణ్, రమణారెడ్డి, ఆదెన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానం..క్రీడా ప్రాంగణం

- విద్యార్థులకు ఆకతాయిల వేధింపులు
- పట్టించుకునే వారు లేక అధ్వానంగా క్రీడా మైదానం

తాడిపత్రిటౌన్: తాడిపత్రి ఉన్నత పాఠశాల క్రీడామైదానానికి ఆకతాయిల బెడద ఎక్కువైంది. దీంతో క్రీడా ప్రాంగణంలో ఆడుకోవాలంటేనే విద్యార్థులు జంకాల్సిన దుస్థితి నెలకొంది. పట్టణంలోని ఉన్నత పాఠశాల క్రీడామైదానం దశాబ్దాలుగా ఎంతో మంది విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్ది ఉన్నత స్థాయికి వెళ్లేలా చేసింది. అయితే నేడు క్రీడా మైదానంలో ఆడుకోవడానికే వీలులేని పరిస్థితి నెలకొంది. గతంలో వరసగా కురిసిన వర్షాలు కొంత కారణం అయితే ఆకతాయిల బెడదతో ఉన్న కొంచెం స్థలంలో కూడా ఆడుకోలేని దుస్థితి నెలకొంది. వరుస వర్షాల కారణంగా క్రీడాప్రాంగణంలో నీరునిలిచి చెరువును తలపించింది. చాలా కాలం నీరు నిలబడటంతో దాదాపు సగబాగం గడ్డి, పిచ్చిమొక్కలతో దర్శనం ఇస్తోంది. పట్టించుకునే వారు లేకపోవడంతో చాలా మంది బయటి వ్యక్తులకు అడ్డాగా మారింది. వ్యసనాలకు బానిసలైన వారు నిత్యం ఇక్కడే మద్యం సేవిస్తున్నారు. క్రీడాప్రాంగణంలోనే మందు, సిగరెట్‌లు సేవించడమే కాకుండా విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని తెలుస్తోంది. స్కూల్‌లోని చిన్న పిల్లలకు డబ్బు ఆశ చూపి సిగరెట్లు, కూల్‌డ్రింక్‌లు, వాటర్ ప్యాకెట్‌లు తెప్పించుకుంటూ అక్కడే మద్యం సేవిస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దాడులకు తెగబడుతుతున్నారు. అలాగే మైదానంలోకి పశువలు వస్తుండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణానికి పూర్వవైభవం తీసుకురావాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.



పిచ్చిమొక్కలు, చెత్తకుప్పలతో నిండిన తాడిపత్రి హైస్కూల్ క్రీడా మైదానం

దాడులకు తెగబడుతున్నారు



క్రీడాప్రాంగణంలోనే చాలా మంది మద్యం, సిగరెట్ తాగుతున్నారు. క్రీడాకారిణులను హేలనగా మాట్లాడుతున్నారు. ఇదేమని ప్రశ్నించినందుకు వాదనలకు దిగుతున్నారు. కొంతకాలం క్రితం ఈ విషయమై గొడవ జరగడంతో నా కారు అద్దాలు ధ్వంసం చేసి, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేశారు. అందువల్ల వారిని ప్రశ్నించాలంటే భయపడాల్సి వస్తోంది. క్రీడామైదానంలో ఆటలనే మానేసాం.

– కాశీ విశ్వనాథ్, వ్యాయామ ఉపాధ్యాయుడు

ఆడుకోవాలంటే భయం..



పాఠశాల క్రీడామైదానంలోనే బయటి వ్యక్తులు వచ్చి మందు తాగుతున్నారు. మైదానంలోకి వెళ్లి ఆడుకొవాలంటే భయపడాల్సిన దుస్థితి నెలకొంది. మైదానంలో ఆడే సమయంలో అసభ్యంగా మాట్లాడుతూ కామెంట్లు చేస్తున్నారు. కబడ్డీ క్రీడలో జిల్లా స్థాయిలో ఆడి వచ్చినాం. ప్రస్తుతం ఇక్కడ ప్రాక్టీస్ చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఉపాధ్యాయుల కూడా ఏం చేయలేక మైదానం వైపు వెళ్లకుండా చేశారు.

– పావని, కబడ్డీ క్రీడాకారిణి

అధికారులు స్పందించాలి



బయటి వ్యక్తులు విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారు. సిగరెట్లు, మందు క్రీడామైదానంలో తాగుతున్నారు. వారికి అవసరం అయినవి పిల్లలతో రూ.10 ఇస్తాం తెచ్చివ్వండి అంటూ వేధిస్తున్నారు. లేకుంటే దాడులు చేస్తున్నారు. క్రీడాప్రాంగణంలో ఆడుకోలేక పోతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడామైదానానికి పూర్వవైభవం తీసుకునిరావాలి.

– పక్రుద్దీన్, కబడ్డీ క్రీడాకారుడు

శైవ క్షేత్రాలకు కార్తీక శోభ



గుంతకల్లురూరల్: అలంకరణలో బుగ్గ సంగమేశ్వరుడు



తాడిపత్రి అర్బన్: పూజలందుకుంటున్న పార్వతీదేవి



పామిడి: అలంకరణలో భోగేశ్వరుడు



దోనిముక్కల విరుపాక్షేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

గుంతకల్లు రూరల్: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా గుంతకల్లు మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం బుగ్గ సంగమేశ్వర ఆలయం, దోనిముక్కల విరుపాక్షేశ్వర స్వామి ఆలయం, కసాపురం కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ పెరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మాత్రమే కాకుండా కర్ణాటక నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు పవిత్ర స్నానాలను ఆచరించి సంగమేశ్వరుడికి అభిషేకాలతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ అన్నదాన కేంద్రంలో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ భక్తులకు నిరంతర అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా దోనిముక్కల విరుపాక్షేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుండే భక్తులు క్యూలైన్లలో నిలబడి స్వామిని దర్శనం చేసుకున్నారు. కార్తీక మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఉత్సవాలను ప్రారంభించారు. శివస్వామి మాలధారులు, సేవకులు ఆదివారం రాత్రి నుంచి ఆలయాన్ని శుద్ధి చేసి, మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేసి విశేష పూజలతోపాటు పుష్పాలంకరణ చేశారు. అలాగే పార్వతీదేవి ఆలయంలో అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. అదేవిధంగా పట్టణంలోని వేదగాయత్రీమాత ఆలయంలో అమరలింగేశ్వరుడికి, వేదగాయత్రీమాతకు, సత్యనారాయణ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో సోమవారం కార్తీక మాస పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వర శర్మ ఆధ్వర్యంలో పూజారులు చంద్రాశర్మ, అనిల్ తదితరుల వేదమంత్రోచ్ఛారణల నడుమ అభిషేక పూజలు చేశారు.

ప్రజా సమస్యలపై ఉద్యమాలు

బుక్కరాయసముద్రం: ప్రజా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా ఒత్తిడి తీసుకురావడానికి ఉద్యమాలకు శ్రీకారం చుట్టామని సీపీఎం జిల్లా కార్యవర్గ దర్శి సభ్యులు బాల రంగయ్య, నల్లప్ప అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీపీఎం ఐదో మహాసభలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశంలో నేంద్రమోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. లేకుంటే ఉద్యమబాట పడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కుళ్లాయప్ప, శివారెడ్డి, శ్రీనివాసులు, పుల్లయ్య, నాగరాజు, నాగేంద్ర, నెట్టికల్లయ్య, సంజీవరెడ్డి, చెన్నప్ప, వెంకటలక్ష్మి, హరిక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడి ఎంపికపై హర్షం

పామిడి: రెవెన్యూ డివిజన్ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా మండలంలోని గజరాంపల్లి వాసి సాకే గోవిందు ఎంపికవ్వడంపై యువత బృందం హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వారు ఆయనకు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, షెక్షావలి, నవీన్, సురేష్, రవితేజ, రాజు, రవి, దివాకర్, వెంకటేష్, సుంకప్ప, ఓబులేసు, నారాయణ, బాలు, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

గుంతకల్లు రూరల్: జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వందలాది మంది విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, జిల్లా కోశాధికారి ఆంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జూనియర్ కళాశాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు పూర్తయినా.. ఇచ్చిన హామీని పట్టించుకోవడం లేదన్నారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడంతోపాటు, ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను వెంటనే భర్తీ చేసి, మౌళిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు.

ఆర్అండ్‌బీ పోలీస్ ఔట్‌పోస్టును తెరిపించండి

గుంతకల్లుటౌన్: నిత్యం జనంతో రద్దీగా ఉండే ఆర్అండ్‌బీ సర్కిల్‌లో మూసేసిన పోలీస్ ఔట్ పోస్టును తెరిపించి పోలీసు సిబ్బందిని నియమించాలని డీఎస్పీ శ్రీనివాసులును సీపీఎం నాయకులు కోరారు. సోమవారం డీఎస్పీని సీపీఎం పట్టణ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు తదితరులు కలసి వినతిపత్రాన్ని అందజేశారు. రైల్వేస్టేషన్, స్కూళ్లు, ప్రార్థనా మందిరాలు, రైల్వేక్వార్టర్స్‌కు వెళ్లే ప్రధాన మార్గమైన ఆర్అండ్‌బీ సర్కిల్ రోడ్డులో మద్యం షాపును ఏర్పాటు చేయడం వల్ల సాయంత్రం వేళ మందుబాబుల ఆగడాలు మితిమీరాయని సీపీఎం నాయకులు తెలిపారు. సీపీఎం నాయకులు మారుతి, కసాపురం రమేష్, నాగరాజు, సి.రమేష్, తిమ్మప్ప, రాము తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మొత్తం కరువు ప్రాంతంగా గుర్తించాలి



తాడిపత్రిలో వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్/గుంతకల్లు రూరల్/పుట్లూరు/గుత్తి రూరల్/పెద్దవడుగూరు/బుక్కరాయసముద్రం/పామిడి: జిల్లాలోని 31 మండలాలనూ కరువు మండలాలుగా గుర్తించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. తాడిపత్రి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద వారు సోమవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ రజాక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కన్వీనర్ చిరంజీవియాదవ్ మాట్లాడుతూ జిల్లాలో 31 మండలాలుండగా కేవలం ఏడు మండలాలనే ప్రభుత్వం కరువు మండలాలు ప్రకటించడం సిగ్గుచేటన్నారు. సీపీఐ పట్టణ సహాయకార్యదర్శి శ్రీరాములు, వృత్తిసంఘం నియోజకవర్గ కార్యదర్శి సాలవేముల సూరి, ఏఐటీయూసీ నాయకులు ఉమాగౌడ్, రమణ, కృష్ణానాయక్, అబ్రహం, రత్నమయ్య, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు. అలాగే గుంతకలును ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, మండల సహాయ కార్యదర్శిరాము రాయల్ తదితరులు మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గ వాసులకు నీటిని అందించే విషయంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ చిత్తశుద్ధి కనబరచడం లేదని విమర్శించారు. అదేవిధంగా పుట్లూరును కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ మండల కార్యదర్శ పెద్దయ్య, నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌ప్రసాద్‌కు అందజేశారు. గుత్తిలో నిర్వహించిన ధర్నాలో సీపీఐ మండల కార్యదర్శి రాందాసు, రైతు సంఘం అధ్యక్షుడు వెంకట్రాముడు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి రమేష్ బాబు, సీపీఐ నాయకులు నరసింహయ్య, పట్టణ సహాయ కార్యదర్శి ఆటో నజీర్, సీనియర్ నాయకులు రామకృష్ణ, వన్నూరుసాబ్, వెంకటేష్, మల్లికార్జున పాల్గొన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఓబిలేసుకు అందజేశారు. పెద్దవడుగూరులో నిర్వహించిన ధర్నాలో సీపీఐ నాయకులు వెంకట్రాముడుయాదవ్, సూర్యనారాయణరెడ్డి, పోలా రంగస్వామి, ఆదినారాయణ, అల్లాబకాస్, చిన్న రంగడు తదితరులు పాల్గొన్నారు. అలాగే బుక్కరాయసముద్రంలో నిర్వహించిన ధర్నాలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, సీపీఐ నియోజక వర్గం కార్యదర్శి టి. నారాయణస్వామి, రామాంజినేయులు, రాము, మర్రిస్వామి, తిరుపతయ్య, నాగేంద్ర, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ పుణ్యవతికి వినతి పత్రం అందజేశారు. పామిడిలో నిర్వహించిన ధర్నాలో సీపీఐ మండల కార్యదర్శి కే రహీమ్, సహాయ కార్యదర్శి ఎస్.నాగరాజు పాల్గన్నారు. అనంతరం సీపీఐ నాయకులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శ్రీధరమూర్తికి అందజేశారు.

రైతు సమస్యలు పరిష్కరించాలి



యాడికిలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు




శింగనమలలో బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

యాడికి/శింగనమల: రైతుల సమస్యలు పరిష్కరించాలని యాడికి తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలసి రైతు సంఘం నాయకులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడు యాదవ్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఇవ్వాల్సిన రూ.20 వేలను తక్షణమే అందించటమే కాకుండా బ్యాంకుల్లో పంట రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితుల వలన రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయన్నారు. అనంతరం రైతులను ఆదుకోవాలంటూ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీరాములు, ఓబిరెడ్డి, వడ్డే రాముడు, ఆదినారా యణ యాదవ్, గరిడి శివన్న, రాఘవ, కుళ్లాయిరెడ్డి, ఆంజనేయులు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే శింగనమలను కరువు మండలంగా ప్రకటించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శింగనమల తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు శ్రీనివాసులు, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హద్దుల ఏర్పాటుకు నేడు రీ సర్వే

గుంతకల్లుటౌన్: సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల హద్దుల ఏర్పాటుకు మంగళవారం ఉదయం 10 గంటలకు మండల సర్వేయర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్లు రీ సర్వే చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ట్యాంకు స్థలం కబ్జా అవుతోందని, దీనిని రక్షించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అపర్ణ ఫిర్యాదు మేరకు ఎస్ఎస్ ట్యాంక్ స్థల హద్దులను ఏర్పాటు చేసేందుకు సర్వే చేస్తామన్నారు. ఎస్.ఎస్.ట్యాంకు చుట్టుపక్కల స్థలాలు కలిగిన యజమానులు సర్వేలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఆగని ఇసుక దందా!



పి.జలాలపురం వంకలో ఇసుక నింపుతున్న దృశ్యం

శింగనమల: టీడీపీ నాయకుల ఇసుక దందా ఆగడం లేదు. మండలంలోని పి.జలాలపురం గ్రామ సమీపంలో ఉన్న వంకలో నుంచి అక్రమంగా మూడు నెలలు నుంచి ఇసుకను తరలిస్తుండంతో విసిగిపోయిన గ్రామస్తులు, రైతులు శనివారం రాత్రి అడ్డుకుని పోలీసులకు ఇటాచీ, ఐదు టిప్పర్లను పట్టించారు. పోలీసులు, గ్రామస్తులు మాట్లాడుతుండగానే టిప్పర్ల వెళ్లిపోయాయి. ఇటాచీని మాత్రం పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తీసుకవచ్చారు. ఒక రోజు కూడా గడవక ముందే మరో ఇటాచీని తెప్పించి, అదే వంకలో సోమవారం ఉదయం నుంచే ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. తమకు ప్రజాప్రతినిధుల అండదండలున్నాయని, పోలీసులు మమ్మల్ని ఏం చేయలేరని టీడీపీ నాయకులు భయపెడుతున్నారని రైతులు, గ్రామస్తులు వాపోతున్నారు. ఎవరైనా ఉన్నతాధికారులు పట్టించుకుంటారేమోనని సోషల్ మీడియాలో వీడియోలో పెట్టారు. ఇసుక తరలించడం వల్ల భూగర్భజలం తగ్గిపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులైనా అండగా ఉంటారని భావించామని, వారు కూడా పట్టించుకోవడం లేదని రైతులు, గ్రామస్తులు వాపోతున్నారు. ఉన్నతాకారులు స్పందించి ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోవాలని వారు కోరారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



ఎస్ఐ బీఆర్ ప్రసాద్

పామిడి: పామిడి ఎస్ఐగా బీఆర్ ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న బెస్తరాజు మూడునెలల క్రితం చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో అనంతపురం వీఆర్ నుంచి బీఆర్ ప్రసాద్ ఇక్కడకు ఎస్ఐగా బదిలీపై వచ్చారు. ప్రజలు, పోలీసుల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని ఈసందర్భంగా ఎస్ఐ అన్నారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన

గుత్తి: పట్టణంలోని 10, 14వ వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు, తాగునీటి సమస్య గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల ప్రారంభం

గుత్తి: గుత్తి నుంచి ఆర్ఎస్ వరకూ రోడ్డు విస్తరణ పనులు మున్సిపల్ అధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్న జేసీబీ సాయంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లు, చెత్తా చెదారం తొలగించారు. రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, చైర్ పర్సన్ వన్నూర్‌బీ పర్యవేక్షించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల సర్వే రిపోర్టు నివేదించాలి



రెవెన్యూ సిబ్బందితో సమీక్షిస్తున్న తహసీల్దార్

పామిడి: పామిడిలో పెన్నానది, గుత్తి బీసీసీ రోడ్డు ఆక్రమణలపై సోమవారం తహసీల్దార్ శ్రీధరమూర్తి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వీఆర్వోలు, సర్వేయర్లతో మాట్లాడారు. పామిడి పెన్నానది ప్రాంతం, గుత్తి బీసీసీ రోడ్డుకిరువైపులా గల ఆక్రమణలపై సర్వే చేపట్టాలన్నారు. పారదర్శకంగా సర్వే చేపట్టి రిపోర్టులను శుక్రవారం లోపు నివేదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మురళీధర్, రీసర్వే డీటీ విజయ్, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఇళ్లపై విద్యుత్ తీగలు తొలగించండి'

పుట్లూరు: మండలంలో నివాస గృహాలపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని ఏపీ కౌలు రైతుల జిల్లా సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సమస్యను అధికారులకు వివరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

గుత్తి రూరల్: మండలంలోని ఇసురాళ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గాలి ఓబుళరెడ్డి(46) అనారోగ్యంతో మృతి చెందాడు. పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన చురుగ్గా పని చేసేవాడు. ఏడాది క్రితం రోడ్డు ప్రమాదం జరిగి అతడి ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం తీవ్ర అనారోగ్య సమస్యలతో ఇంట్లో మృతి చెందాడు. అతడి భార్య గతంలోనే మృతి చెందగా ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు మంజునాథ్‌రెడ్డి, శేషారెడ్డి, సర్పంచ్ వాసుదేవరెడ్డి, భరత్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, పుల్లారెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

పామిడి: మండలంలోని సారకాయలపేట గ్రామానికి చెందిన కురబ పరుశురాముడు భార్య రేణుకమ్మ సోమవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ కలహాలతో ఆమె పురుగుల మందు తాగింది. కుటుంబసభ్యులు ఆమెను వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తాడిపత్రిటౌన్: మండలంలోని రావివెంకటాంపల్లి సమీపంలో ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. రావి వెంకటాంపల్లికి చెందిన భాస్కర్‌నాయుడు, నారాయణస్వామి యర్రగుంటపల్లి గ్రామానికి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా వెనుక వైపు నుంచి ద్విచక్రవాహనంలో గుర్తు తెలియని వ్యక్తి ఢీ కొట్టాడు. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు వారిని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు.